ప్రజాశక్తి
శుక్రవారం 11 నవంబర్ 2022
5
శ్రీ సత్యసాయి





మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నివాసం వద్ద పోలీసు పహారా

మడకశిరలో హైటెన్షన్

◆ పోలీసు వలయంలో పట్టణం
◆ టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం
◆ మాజీ ఎమ్మెల్సీ ఇంటి ముట్టడికి దళితసంఘం నేత పిలుపు
◆ ముందస్తు అరెస్టులతో భగ్నం చేసిన పోలీసులు

ప్రజాశక్తి-మడకశిర

మడకశిరలో గత వారం రోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల మధ్య సాగుతున్న మాటల యుద్ధం తారా స్థాయికి చేరుకుంది. ఏకంగా ముఖ్య నేతల ఇళ్లను ముట్టడించేలా రెండు పార్టీల మద్దతుదారులు పిలుపు ఇచ్చారు. దీంతో పట్టణంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి టిడిపి, వైసిపి నేతలను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అంగన్వాడీ పోస్టుల నియామకాల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని, రోస్టర్ పద్ధతి ఏ మాత్రం పాటించకుండా దళితులకు అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆరోపించారు. అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ వారం రోజుల క్రితం ఐసిడిఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సమయంలో అధికార పార్టీ నేతలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దీనికి ప్రతిగా స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి కూడా ఘాటు వ్యాఖ్యలు చేశారు. అప్పటి నుంచి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే తిప్పేస్వామికి మద్దతుగా దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు హనుమంతు టిడిపి నేతలపై విమర్శలు చేశారు. ఈ విమర్శలు పెద్ద దుమారం రేపాయి. మాజీ ఎమ్మెల్సీ ఇంటిని ముట్టడిస్తానని హనుమంతు ప్రకటించారు. ఇతనికి ధీటుగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటిని ముట్టడిస్తామని ప్రకటించారు. ఇలా రెండు పార్టీల నేతలు గురువారం నాడు ఇళ్ల ముట్టడికి సిద్ధం అయ్యారు. దీంతో మడకశిర పట్టణంలో పరిస్థితి అదుపుతప్పేలా కన్పించింది. రెండు పార్టీల నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లను దృష్టిలో ఉంచుకున్న పోలీసులు దీనిపై దృష్టి సారించారు. వారం రోజుల క్రితం కూడా దళిత సామాజిక వర్గానికి చెందిన నేతలను బైండోవర్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అయినా నేతలు ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతాం అంటూ ఎవరికి వారు ప్రకటనలు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పెద్ద ఎత్తున పట్టణంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన టిడిపి నేతలు 18 మందిని అదుపులోకి తీసుకుని పెనుగొండకు తరలించారు. డిహెచ్‌పిఎస్ నాయకుడు హనుమంతు, రఘులతో పాటు మరో ఇద్దరిని రొద్దం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా 144 సెక్షన్‌తోపాటు 30 పోలీస్ యాక్టును అమల్లోకి తెచ్చారు. ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ సూచనల మేరకు ఎమ్మెల్యే తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల ఇంటి వద్ద బుధవారం రాత్రి నుంచే ప్రత్యేక పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మడకశిర సిఐ నాగరాజురావు ఆధ్వర్యంలో 8 మంది ఎస్ఐలు, 70 మంది పోలీసులతో పట్టణ వ్యాప్తంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి గురువారం చేపట్టిన ఎమ్మెల్సీ ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేశారు. ఇరు పార్టీ నాయకుల కదిలికలపై గట్టి నిఘా ఉంచి ఎవరినీ బయటకు రానివ్వకుండా కట్టడి చేశారు. పోలీసుల ముందస్తు చర్యలతో అధికార, ప్రతిపక్ష పార్టీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. కాగా ఈ సమస్య ఇంతటితో ముగుస్తుందా లేక రెండు పార్టీల నేతలు ఈ మాటల యుద్ధాన్ని ఇంకా కొనసాగిస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

కొనసాగిన అరాచకం



అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న సమయంలో సృహ తప్పి కింద పడిపోయిన రైతు రామయ్య యాదవ్ కూతురు

◆ రైతు బతుకును బజారుకీడ్చిన ప్రభుత్వం
◆ మూడవ రోజు కొనసాగిన దాష్టీకం
◆ రైతుకు మద్దతుగా యాదవ సంఘం పోరాటం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సోమందేపల్లి మండలం కావేటినాగేపల్లి గ్రామానికి చెందిన రైతుపై 3వ రోజు గురువారం కూడా అరాచకం కొనసాగింది. ప్రభుత్వానికి భూమిని ఇవ్వలేదని పేద రైతు బతుకును ప్రభుత్వం అధికారుల సాయంతో బజారకీడ్చింది. 3.36 ఎకరాల భూమిని నాసిన్ సంస్థకు ఇవ్వను... తన బతుకుదెరువును వదిలేయండని అధికారులను ప్రాధేయపడినా ప్రయోజనం లేకుండాపోయింది. మూడు రోజులుగా ఆ పేద రైతుపై అధికార యంత్రాంగం అరాచకాన్నే కొనసాగిస్తోంది. పగలు అయితే అందరి దృష్టికి వెలుతుందన్న ఉద్దేశంతో చీకటి పడుతూనే పోలీసులు, రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి పేద రైతు కుటుంబంపై దాడి చేయడం, పొలంలోనున్న ఇంట్లోని సామాన్లు అన్నింటినీ బయటకు విసిరేశారు. రైతు ముందుజాగ్రత్త కోసం ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆధారాల్లేకుండా చేశారు. ఇంటి చుట్టూ రాత్రికి రాత్రి పెద్ద ప్రహరీ నిర్మించి అందులోకి రైతు రామయ్య యాదవ్ కుటుంబాన్ని అనుమతించకుండా అడ్డుకున్నారు. ప్రహరీ వద్దనే కూర్చొని రైతు కుటుంబం రోడ్డుపై నిరసన తెలిపారు. అక్కడ కూడా వారిని కూర్చోనివ్వకుండా పోలీసులు పక్కకు ఈడ్చేశారు. తమ బతుకుదెరువును లాక్కుంటే జీవనాధారం ఉండబోదని రోధించినా కనికరం చూపలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయంటూ నిర్ధాక్షిణ్యంగా రైతు కుటుంబాన్ని బయటకు లాగేశారు.

రోడ్డుపై బేటాయించి నిరసన

అధికారులు బలవంతంగా భూములను ఆక్రమించడాన్ని వ్యతిరేకిస్తూ రైతు కుటుంబం పొలమున్న ప్రాంతంలోనే రోడ్డుపై బేటాయించి నిరసన చేపట్టారు. మూడు రోజులుగా తమకు నిద్రలేకుండా చేస్తున్నారని, పగలంతా మౌనంగా ఉంటూ రాత్రి సమయంలో తమ ఇంటిపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలో కూర్చోని నిరసన తెలుపుతున్న సమయంలో రామాయ్య కుమార్తె సొమ్మసిల్లి పడిపోయింది. ఈ నిరసనకు యాదవ సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

కట్టుబట్టలతో బయటపడేశారు..

కట్టుబట్టలతో పేద రైతు కుటుంబాన్ని బయటపడేశారు. అధికారులు అధికారుల్లాగా వ్యవహరించడం లేదు. దొంగల్లాగా వ్యవహరిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇంట్లోకి చొరబడి వస్తువులన్నీ ధ్వసం చేస్తున్నారు. కట్టుబట్టలతో రైతు కుటుంబాన్ని బయటపడేశారు. దీనిపై న్యాయ పోరాటాన్ని ప్రారంభిస్తాం. జాతీయ మానవ హక్కులనూ ఆశ్రయిస్తాం. ఏదైనా సమస్య ఉంటే మాట్లాడి ఒప్పించాలిగానీ, ఈ రకంగా ఒక కుటుంబాన్ని బయటపడేయడం అన్యాయం. అన్ని సంఘాలను కలుపుకుని పెద్దఎత్తున పోరాడుతాం.

యాదవ సంఘం, జిల్లా అధ్యక్షులు లక్ష్మి నరసింహప్ప.

మాపై కక్షగట్టారు...

తనకున్న జీవనాధారం 3.36 ఎకరాల పొలమే. దీన్ని లాక్కోవద్దని అధికారులను వేడుకున్నాం. అయినా పట్టించుకోలేదు. కట్టుబట్టలతో బయటపడేశారు. ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు అందరం బయటపడాల్సి వచ్చింది. నాసిన్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఇంటివద్దకొచ్చి బెదిరింపులకే దిగుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ జీవనాధారమైన పొలాన్ని తమకు ఇచ్చేయాలి.

రామయ్య యాదవ్, బాధిత రైతు.



పెనుకొండ రహదారిపై రాస్తోరోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఎంఎస్ఎఫ్ నాయకులు

కీచక ఉపాధ్యాయుడుని సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఎంఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం మణేసముద్రం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కీచక ఉపాధ్యాయుడు నరసింహప్పను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఆదర్శ డిమాండ్ చేశారు. ఈమేరకు గ్రామస్థులతో కలిసి పెనుకొండ జాతీయ రహదారిపై రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు నరసింహప్ప విదార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. ఘటన జరిగి ఐదు రోజులవుతున్నా బయటకు రాకుండా పాఠశాల హెచ్‌ఎం ప్రయత్నించారన్నారు. అంతేగాకుండా ఈ విషయాలను బయటకు చెబితే టీసీ ఇచ్చి పంపుతామని బెదిరించినట్లు విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోయారన్నారు. వెంటనే నరసింహప్పను సస్పెండ్ చేయాలన్నారు. విషయం తెలుసుకున్న హిందూపురం రూరల్ సిఐ అక్కడికి చేరుకుని రాస్తారోకో విరమించాలని కోరారు. అయితే ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దీంతో సిఐ కేసు నమోదు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుల నరసింహప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు జైచంద్ర, భరత్, హరి, శ్రీరామ్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల్లో తనిఖీలు కొనగించాలి

ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా సరిహద్దుల్లో అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల్లో నిరంతరం తనిఖీలు కొనసాగాలని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జిల్లాలోని సెబ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్‌రాష్ట్ర సరిహద్దులు, జిల్లాల వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎక్సైజ్ చెక్స్‌పోస్టులను నిరంతర పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. నాటుసారా జోలికెళ్లకుండా, వాటి వల్ల ఏర్పడు దుష్పరిణామాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల లిక్కర్, ఎపి లిక్కర్, నాటుసారా, ఇసుక, గేమింగ్ కేసులపై స్టేషన్ వారీగా సమీక్ష చేశారు. జిల్లాలో నాటుసారా ప్రభావం బాగా తగ్గుముఖం పట్టిందని, అయినప్పటికీ నిఘా కొనసాగించాలన్నారు. ఎన్‌డిపిఎల్, డిపిఎల్ కేసుల్లో అరెస్టు కాని నిందితులపై చట్టపరమైన చేపట్టాలన్నారు. కేసుల ఛేదింపు పెరగాలన్నారు. గుట్కా కేసుల సంబంధించి కోర్టులో స్టే ఉండటం వల్ల జిల్లా పరిధిలో ఎక్కడ గుట్కా కేసులు నమోదు చేయరాదన్నారు. సరిహద్దు స్టేషన్లలో గట్టి నిఘా పెంచాలన్నారు. పాత నేరస్తులు మళ్లీ నేరాలకు ఒడిగడితే కేసులతోపాటు బైండోర్లు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెబ్ ఆధికారి కెవి రామకృష్ణప్రసాద్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, జిల్లాలోని సెబ్ సిఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్



కర్నూలులో ఎమ్మెల్సీతో హిందూపురం నాయకులు

ఎమ్మెల్సీని కలిసిన 'పురం' నాయకులు

హిందూపురం : హిందూపురంలో ఇటీవల చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణా లమాల నేపథ్యంలో ఎమ్మెల్సీ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ మహమ్మద్ ఇక్బాల్‌ను స్థానిక నాయ కులు కలిశారు. ఈమేరకు దాదాపు 40 వాహనా ల్లో కర్నూలుకు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అదిష్టానం హిందూపురం వెళ్లాలని సూచించిందని, తండ్రి తీవ్ర అనారోగ్యంతో భాధపడుతుండడంతో ఆయనకు సేవలు చేస్తున్నట్లు తెలిపారు. మరో మూడు రోజుల్లో హిందూపురం వస్తానని, ఎవరూ ఆధైర్య పడవద్దని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీని కలసిన వారిలో మన్సిపల్ వైస్ ఛైర్మన్ జబీవుల్లా, మాజీ ముతువల్లీ కలీం తదితరులు ఉన్నారు.

ఖైదీలకు నాణ్యమైన ఆహారం అందించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి దీనబాబు

హిందూపురం : వివిధ కేసుల్లో సబ్‌జైలులో ఉంటున్న ఖైదీలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి దీనబాబు సూచించారు. గురువారం స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఖైదీలు ఉండే జైలు గదులు, వారికి అందించే మంచినీరు, ఆహార పదార్థాలు, వండడం కోసం ఉపయోగించే నిత్యావసరాలను పరిశీలించారు. అనంతరం ముద్దాయిలతో ఏ నేరం చేసి జైలుకు వచ్చారు, ఎంత కాలం నుండి ఉంటున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ న్యాయవాదులను నియమించుకోలేని ముద్దాయిలు ఉంటే తనకు చెబితే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సిద్దు, వెంకటేష్, కళావతి, రత్నమ్మ, సంతోషి కుమారి, పార్వతి, లోక్ అదాలత్ సభ్యులు శారదా, హేమావతి తదితరులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి దీనబాబు

తమ్ముని ఆశయం కోసం పనిచేస్తా

◆ పురంలో వైసిపి జెండా ఎగురవేస్తాం ◆ చౌళూరి రామకృష్ణారెడ్డి సోదరి మధుమతి రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో వైసిపి జెండా ఎగురవేయాలన్న తన తమ్ముడు చౌళూరి రామకృష్ణారెడ్డి ఆశయం కోసం తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి పని చేస్తానని మధుమతి రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో రామకృష్ణారెడ్డి భార్య జ్యోత్స్న, బావ నాగభూషన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. హిందూపురంలో వైసిపి ఆవిర్భావం నుంచి రామకృష్ణారెడ్డి పార్టీ అభివృద్ధి కోసం పని చేశారని చెప్పారు. రాజకీయంగా తన తమ్ముడి ఎదుగదలను చూడలేక కక్షకట్టి హత్య చేశారన్నారు. హిందూపురంలో వైసిపి జెండా ఎగుర వేయడమే లక్ష్యంగా పని చేసిన తన తమ్ముడి ఆశయం కోసం తాను హిందూపురంలో వైసిపి అభివృద్ధి కోసం కెనడాను వదలి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు చెప్పారు. అధిష్టానం ఆదేశాలను శిరాసావహిస్తామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను తమ కుటుంబ సభ్యులతో కలిసి కలిశామన్నారు. వారి ఆశీస్సులతో త్వరలోనే ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. తాను డబ్బు సంపాదించడం కోసం రాజకీయాల్లోకి రావాలనుకోలేదన్నారు. హిందూపురంలో గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్తానన్నారు. పార్టీ పెద్దలు సానుకూలంగా స్పందించి తనకు హిందూపురం ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తే సమర్థవంతంగా పనిచేసి, వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రామకృష్ణారెడ్డి హత్య కేసు దర్యాప్తుపై సంతప్తిగా ఉన్నారా అని మీడియా ప్రతినిధుల అడిగిన ప్రశ్నకు ఆమె అసంతప్తిగా ఉన్నామని సమాధానం ఇచ్చారు. కేసు విషయంలో తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను పార్టీ పెద్దల దష్టికి తీసుకెళ్లామన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేసేలా చర్యలు చేపడతామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని తెలిపారు. హత్య కేసు నిందితులకు శిక్ష పడేంత వరకు ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ను తాము వ్యతిరేకిస్తామన్నారు. ఈ సమావేశంలో హిందూపురం ఎంపిపి రత్నమ్మ, ఇతర కుటుంబం సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న చౌళూరు రామకృష్ణారెడ్డి సోదరి మధుమతి

విస్తరిస్తున్న లంపీ స్కిన్ వైరస్

ప్రజాశక్తి-అగళి

మండలంలోని 'చాపకింద నీరు'లా పశువులకు లంపీ స్కిన్ వైరస్ విస్తరిస్తోంది. మండలవ్యాప్తంగా మూడు పంచాయతీల్లో దాదాపు 12 ఆవులకు ఈ వైరస్ సోకి మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. పశువులకు తొలుత కళ్లు, ముక్కు నోటి నుంచి గొంగ కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తర్వాత చర్మం కింద కణితులు, బుడిపెలు ఏర్పడుతాయి. చివరగా మెడ, తొడల దగ్గర లింప్ గ్రంథులు వాచి, పొదుగు, రొమ్ము భాగం, కీళ్లలో నీరు చేరి పశువు నీరసంగా మారి మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులందరూ ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం అగళి వెటర్నరీ వైద్యుడు బదిలీపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి డాక్టర్లు కొనసాగుతున్నారు. వీరు పశువులకు సోకుతున్న లంపి స్కిన్‌పై అవగాహన లేకపోవడంతో మందులు ఇవ్వడం లేదని బాధిత రైతులు అంటున్నారు. ఈ సమయంలో పశువులను ఎలా బతికించుకోవాలో దిక్కు తోచడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే నరసంభూతి, కోడిపల్లి, బ్యాడిగెర, ఆలూడిముత్యం తదితర ప్రాంతాల్లో 12 ఆవులు చనిపోయాయని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లంపి స్కిన్ వ్యాధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



లంపీ స్కిన్ వ్యాధితో మృతిచెందిన ఎద్దు

నాశిరకంగా సబ్సిడీ విత్తనకాయలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో బోరు కింది సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీ కింద పంపిణీ చేసేందుకు స్థానిక రైతు భరోసా కేంద్రానికి వచ్చిన వేరుశనగ కాయలు నాసిరంగా వచ్చాయి. ఈమేరకు వేరుశనగ కాయలు తీసుకునేందుకు చాలామంది రైతులు గురువారం ఆర్‌బికే వచ్చి చూడగా ఎక్కువశాతం కాయలు నాసిరకంగా కనిపించాయి. విషయాన్ని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డికి సిబ్బంది దృష్టికి తీసుకుపోగా వెంటనే ఆయన వచ్చి పరిశీలించారు. దీంతోపాటు విషయాన్ని ఎడిఎ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం వేరుశనగ కాయల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారి ఆదేశాల మేరకు వెనక్కి పంపినట్లు తెలిపారు. త్వరలోనే నాణ్యమైన కాయలు వస్తాయన్నారు. అయితే అర్హత ఉన్న రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు యుగంధర, ధనలక్ష్మి, రైతులు ఆదినారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, కొండారెడ్డి, శ్రీరాములు, రమణయ్య, నరసింహులు, పాల్గొన్నారు.



విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న రైతులు, వ్యవసాయ అధికారి



నాడునేడు పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

నాడు-నేడు పనులకు భూమిపూజ

రొద్దం:మండలంలోని పెద్దగువ్వలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టనున్న నాడునేడు పనులకు గురువారం భూమిపూజ చేసినట్లు హెచ్‌ఎం నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు కింద పాఠశాలకు రూ.42లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, సర్పంచ్ రూప, తహశీల్దార్ అనంతాచారి, ఎండిఒ రాబర్ట్‌విల్సన్, పాఠశాల కమిటీ ఛైర్మన్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిపై అవగాహన

మడకశిర రూరల్ : మండలంలోని కదిరేపల్లి గ్రామంలో ఫైలేరియా వ్యాధిపై గురువారం రాత్రి స్థానికులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా 20 సంవత్సరాల పైబడిన వారికి ఫైలేరియా వ్యాధికి సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడకశిర పలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బత్తుల కోదండరామిరెడ్డి, డీఎస్సీ మెడికల్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు. పి.ఎస్.సి సిబ్బంది, సచివాలయం ఎఎన్‌ఎంలు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ అకౌంట్స్ దినోత్సవం

పెనుకొండ : పట్టణంలోని పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అకౌంట్స్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నీలం రమేష్‌రెడ్డి అంతర్జాతీయ అకౌంటింగ్ ప్రాముఖ్యత, పుట్టుక, అకౌంటింగ్ పితామహుడు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి జి.ఓబులేసు, హిందీ అధ్యాపకులు హరిప్రసాద్, ఫర్నాజ్, సువర్ణ, విష్ణువర్ధన్‌రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

బుక్కపట్నం : వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ల ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగానే సత్యసాయి జిల్లా పరిధిలో 378 హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ క్లినిక్‌లో అందుబాటులోకి రాగానే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మమత, హెల్త్ సూపర్‌వైజర్ లింగరామ్మోహన్, సిబ్బంది షఫీ, మురళీగౌడ్, ఎఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జలకళ ప్రారంభం

అమరాపురం : మండల పరిధిలోని అమ్రరం గ్రామానికి చెందిన వైసిపి యువ నాయకుడు త్రిలోక్‌నాథ్ పొలంలో గురువారం వైఎస్ఆర్ర్ జలకళ కార్యక్రమాన్ని ఎంపిపి ఈరన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వారక్క నరసింహమూర్తి, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ చిక్కన్న, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

12న పద్యకావ్యం ఆవిష్కరణ

పెనుకొండ : పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం పెనుకొండ రామబ్రహ్మం రాసిన 'రామపదము బ్రహ్మ వాక్కు' అనే పద్యకావ్య ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ప్రముఖ కవి రచయిత ఆశావాది శశాంక మౌళి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, అష్టావధాని డా సమ్మె మాధవరాజు హాజరుకానున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సాహితీవేత్తలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వంతెనలు నిర్మించాలని వినతి

చిలమత్తూరు : మండలం మీదుగా వెళ్తున్న కుషావతి నది పరీవాహక ప్రాంతాలైన లాలేపల్లి, కోడూరు, సుబ్బరావుపేట గ్రామాలకు వెళ్లే కుషావతి నదిపై బ్రిడ్జిలు నిర్మించాలని ఎంపిపి పురుషోత్తమరెడ్డి విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ చీఫ్ నయీంవుల్లాని కలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఇటీవల కురుసిన భారీ వర్షాలకు నదీ పరీవాహక ప్రాంతాల్లో బ్రిడ్జిలు కొట్టుకుపోయాయన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఇంజినీరింగ్ చీఫ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



ఇంజినీరింగ్ చీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపిపి పురుషోత్తమరెడ్డి

నీటిఎద్దడి నివారణకు శాశ్వత చర్యలు

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

పట్టణ వాసులకు శాశ్వతంగా తాగునీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం పట్టణంలోని మారుతీనగర్‌లో రూ.11.18కోట్లంతో నూతనంగా నిర్మించనున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, మెయిన్ పంపింగ్ డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ గతంలో ధర్మవరం అంటే తాగునీటి ఎద్దడితో ప్రజలు సమతమతమయ్యేవారన్నారు. 2008లో తాను రూ.73కోట్లతో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఫ్రైడ్లైన్ ద్వారా కేతిరెడ్డి సూర్యప్రతాపరెడ్డి మంచినీటి పథకాన్ని ప్రారంభించానన్నారు. అప్పటి నుంచి అమృత్ ఫేస్-1, ఫేస్ -2 ద్వారా రూ.20 కోట్లు వెచ్చించి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా నిరంతరం అందించామని గుర్తు చేశారు. ప్రస్తుతం శివారు ప్రాంతం కాలనీల తాగునీటి ఎద్దడి నివారణకు రూ.11.18 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్, ప్రిన్ పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ శ్రీనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వార్డు కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

నకిలీ పట్టాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కదిరిటౌన్

వికలాంగులకు కేటాయించిన స్థలంలో అక్రమంగా పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు అక్రక పట్టాలను రద్దు చేయాలని వికలాంగుల జెఎసి నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కదిరి పట్టణంలోని హిందూపూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కాలనీలో అక్రమంగా పట్టాలు పొంది నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 81, 83 లో గంగిశెట్టి, అతని కుటుంబ సభ్యులు అక్రమంగా మూడు పట్టాలు పొంది నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ విషయమై అనేకసార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. అక్రమ కట్టడాలు ఆపాలని పోరాటం చేస్తుంటే వికలాంగుడని కూడా చూడకుండా ధన, రాజకీయ బలంతో కొంతమంది అల్లరి మూకలను తమ మీదికి ఉసిగొల్పి దాడులు చేయడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో హైకోర్టులో దావా వేస్తానని హెచ్చరించారు. ఈ సమావేశంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు హైదర్‌వలీ, వెంకటనారాయణ, చంద్రకళ, జయలక్ష్మి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు భూరక్ష పత్రాలను సిద్ధం చేయండి

ప్రజాశక్తి-పుట్టపర్తిఅర్బన్

జగనన్న భుహక్కు, భూ రక్ష పత్రాల పనులు త్వరగతిన పూర్తిచేయాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సర్వే ల్యాండ్ రికార్డుల కమిషనర్ సిద్ధార్థజైన్ ఆయా కలెక్టర్లను కోరారు. గురువారం విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ టియస్ చేతన్, డిఆర్ఓ కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భూ రీ సర్వే జరుగుతోందని, సమగ్ర సర్వే పూర్తి అయిన గ్రామాల్లో భూహక్కుదారులకు భూహక్కు భూ రక్ష పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. రెండువేల గ్రామాల్లో త్వరలో ముఖ్యమంత్రి ఊహకు పత్రాలను పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే, రికార్డుల సహాయ సంచాలకులు రామకష్ణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి చేతన్, డిఆర్ఓ కొండయ్య



ధర్నా చేస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-తాడిమర్రి

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు కార్మిక అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు స్థానిక పంప్‌హౌస్ వద్ద చేపట్టిన ధర్నా గురువారం 14 రోజులుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గత 24 సంవత్సరాల నుంచి పని చేస్తున్నా తమ సమస్యలు పరిష్కరించడంతో ఎల్ అండ్ టి సంస్థతోపాటు ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా కార్మికులకు అందాల్సిన వేతనాలు, పెండింగ్‌లో ఉన్న గ్రాడ్యుటీ చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా సత్యసాయి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని కార్మికులకు రావాల్సిన గ్రాడ్యుటీని త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, సుధాకర్, రామకృష్ణ, తిరుపాలు, ఆచారి రవికుమార్, లక్ష్మీరెడ్డి, లక్ష్మీనారాయణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన సి.మధు అనారోగ్య రీత్యా విధుల్లో ఉండి మృతిచెందడంతో కుమా రుడును హోంగార్డుగా నియమిస్తూ ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ కుటుంబ పెద్ద చనిపోతే ఆ కుటుంబ ఆర్థికంగా చిన్నాభిన్నం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హోంగార్డు కుటుంబాలకు పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ శ్రీశైలంరెడ్డి, డిఆర్ఎ అడ్మిన్ ఆర్ఐ టైటాస్, తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డుకు నియామక పత్రం అందజేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

వాసిరెడ్డి పద్మ తీరుపై తెలుగు మహిళల ఆగ్రహం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తీరుపై ధర్మవరం తెలుగు మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్నా, దాడులు, అత్యాచారాయత్నాలు చేసున్నా మహిళా కమిషన్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. నేరస్థులకు శిక్షపడేలా కృషి చేయాల్సిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మహిళలతో రాజకీయ చదరంగం ఆడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి సాహెబీ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తుకూరు బీబీ, పార్లమెంట్ నాయకురాళ్లు సునంద, చంద్రకళ, స్వర్ణకుమారి, వెంకటలక్ష్మి, సుగుణ, జయలక్ష్మి, పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుమహిళలు

టిడిపి నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

మాజీ ఎమ్మెల్యే ఈరన్న

ప్రజాశక్తి-పెనుకొండ

మడకశిర నియోజకవర్గానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఖండించారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ రమేష్‌బాబును కలిసి అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమన్నారు. మడకశిర చరిత్రలో గతంలో ఎప్పుడూ ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు ఏ ప్రభుత్వం పాల్పడలేదన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా టిడిపి నాయకులను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అన్యాయంగా, అరెస్ట్ చేసి కొంతమందిని పెనుకొండకు తరలించడం ప్రజాస్వామ్యమా.. అని నిలదీశారు. వెంటనే ప్రజాస్వామ్య విలువలను గౌరవించి అరెస్టు చేసిన టిడిపి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగా కన్వీనర్ వి.యం.పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి, ఎస్.రవిభూషన్, మాజీ ఎంపీపీ ఆదినారాయణ, కన్వీనర్ రామాంజనేయులు, బిఎల్ఆర్ వీరకేతరాయ, తమ్ముడేపల్లి హనుమంతారాయ, ఎంపిటిసి లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన జిల్లా అధ్యక్షులు పార్థసారథి

మడకశిర నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులను ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి బికె పార్థసారథి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పరామర్శించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఓర్వలేకే అరెస్టులు..

మడకశిర : టిడిపి శ్రేణుల అరెస్టు అన్యాయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఖండించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా అధికార పార్టీ నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడిన సందర్భాల్లో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు అవినీతిని అరికట్టాలని అధికార పార్టీ నాయకుల ఇళ్ల మట్టడికి పిలుపునిస్తాయన్నారు. ఇది ప్రజాస్వామ్యంలో భాగమన్నారు. అయితే చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అధికారంలో ఉన్న పార్టీ, ప్రతిపక్ష పార్టీ నేతల ఇంటి ముట్టడికి పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. అంతేగాకుండా రోజురోజుకూ టిడిపికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక స్థానిక ఎమ్మెల్యే పోలీసుల జోక్యంతో ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి అప్రజాస్వామ్య చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. అంతేగాక అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకు టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి అర్ధరాత్రి అక్రమ అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్యకర్తలను కాపాడుకోవడానికి ఎంతవరకైనా వెళ్తామన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు.



పెనుకొండ స్టేషన్‌లో సిఐ రమేష్‌బాబుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న



పెనుకొండ మండలం గుట్టూరులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ


అర్హులందరికీ సంక్షేమ పథకాలు

'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

అర్హులందరికీ సంక్షేమ పథకాలను నేరుగా ఖాతాల్లోకి జమ చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని అగ్రహారం, కొత్తకోట గ్రామపంచాయతీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు అందుతున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల సిఎం జగన్ పాలనలో గడప గడపకూ ప్రజా సంక్షేమ పథకాలు వెళు న్నాయన్నారు. అర్హులందరికీ నేరుగా వారి బ్యాంకుఖాతాల్లోకే సంక్షేమ పథకాలు డబ్బులు వెళ్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నటరాజ్, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు నాగమణి, కేశవ, నాగలక్ష్మి, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపిపి నారాయణస్వామి, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ రమణారెడ్డి, నాయకులు కొత్తకోట కేశప్ప, చంద్ర, హర్ష పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ప్రజల ఆదరాభిమానాలే తనను ముందుకు నడిపిస్తున్నాయని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి స్పష్టం చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం కదిరి రూరల్ మండలం మొటుకుపల్లిలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆదరణతోనే రోజురోజుకీ నూతన ఉత్సాహంతో గడప గడపకూ తిరుగుతూ మమేకం అవుతున్నామన్నారు. ఇవన్నీ కూడా సిఎం జగన్ ప్రజల కోసం చేస్తున్న మంచి కార్యక్రమాల వల్ల సాధ్యమైందన్నారు. ప్రజల గుండెలను హత్తుకునే విధంగా రాజశేఖర్‌రెడ్డి తనయుడిగా వారి కంటే రెండు అడుగులు ముందుకేసి ప్రజారంజనకమైన పాలనను తీసుకొచ్చారన్నారు. యావత్ దేశం మొత్తం ఆంధ్ర రాష్ట్రం వైపు చూసే విధంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి, కదిరి మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, వైస్ ఎంపిపి ఆనంద్‌నాయక్, జిల్లా అగ్రి బోర్డు సభ్యుడు సుధీర్‌రెడ్డి, సర్పంచులు రాంప్రసాద్‌రెడ్డి, మణికంఠ నాయక్, చలపతినాయక్, నారాయణనాయక్, శ్రీనివాస్‌నాయక్, భాస్కర్, ఎంపిటిసిలు మధుకర్‌రెడ్డి, లోకేష్, కుమార్, నరసింహనాయక్, సింగిల్‌విండో అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, నరసింహారెడ్డి, ఇరగమరెడ్డి, బాబ్జాన్, విశ్వనాథ్‌రెడ్డి, సోమిరెడ్డి, ఆది, యుగంధర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నల్లచెరువు మండలం కె.పూలకుంటలో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

నల్లచెరువు : గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం మండల పరిధిలోని కె.పూలకుంటలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రమణారెడ్డి, వైస్ ఎంపిపి నారాయణస్వామి, సర్పంచులు, పంచరత్నమ్మ, యూసుఫ్, సింగిల్‌విండో అధ్యక్షులు, జయచంద్రారెడ్డి, ఎంపిటిసిలు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, దశరథనాయుడు, డాక్టర్ శంకర్, బట్టి హైదర్‌వలీ, రోటరీ మౌలా, లక్ష్మీపతి యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని గుట్టూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీరాములు, ఎంపిడిఒ శివశంకరప్ప, వైసిపి సీనియర్ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల పరిధిలోని జన్ట రాయపురం గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు అందుతున్న పథకాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో వక్కలిగల సంఘం ఛైర్‌పర్సన్ నళిని, ఎంపిపి రాధమ్మ, జడ్పిటిసి బూత్ రాజ్, సింగిల్‌విండో అధ్యక్షులు చంద్రప్ప, ఎంపిడిఒ రామారావు, తహశీల్దార్ మహబూబ్ పీరా, సర్పంచి వులిరాజు కవిత, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : అప్పుల బాధ తాళలేక వాస్మోల్ తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమారుడు సురేంద్ర చీరల పాలీష్ సెంటర్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే సురేష్‌కు నాలుగు నెలలక్రితం వివాహమైంది. ఈనేపథ్యంలో అప్పులు పెరిగి సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సురేష్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ఉచిత వివాహాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తిఅర్బన్ : ఉచిత సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోవాలని బిల్డర్ చల్లా సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 18న కొత్తచెరువు మండలం, కడపగానిపల్లి సమీపంలోని చెన్నకేశవపురంలో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయం ప్రాంగణంలో వివాహాలు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న పేదలు ఈనెల 11వ తేదీ నుంచి పుట్టపర్తిలోని ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉన్న పర్తి ధర్మశాలలో దరఖాస్తు ఫారాలు తీసుకుని పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

అమడగూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను నల్లమాడ సిఐ నిరంజన్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న రికార్డులు, కేసులతోపాటు పోలీస్ సిబ్బంది పనితీరు గురించి ఎస్ఐ వెంకటనారాయణను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సస్పెండ్‌పై విచారణ

పరిగి : మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఇటీవలే మధ్యాహ్న భోజన ఏజెన్సీ వ్యవహారంపై ఇటు ఉపాధ్యాయులు అటు విద్యార్థుల తల్లితండ్రులతోపాటు విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలిపిన ఘటనపై డివైఇఒ రంగస్వామి, ఎంఇఒ లక్ష్మీదేవి విచారణ చేపట్టారు. ఈఘటనపై జిల్లా విద్యాశాఖ ఐదుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడమే కాకుండా ఆరుగురికి మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం పాఠశాలకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం అమర్ విద్యామందిర్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశాలించారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

హిందూపురం : ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో బిఎ, బిఎస్‌సి, బీకాం కోర్సుల్లో ప్రవేశాల కోసం మూడవ దశ నోటిఫికేషన్ విడుదలైనట్లు హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులతో పాటు రిజిస్టర్ చేసుకోని వారు ఈనెల 11 వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రిజిస్టర్ చేసుకోవచ్చున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గాండ్లపెంట : విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ అభిరామ్, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున మాట్లాడుతూ 'అవినీతి నిరోధక భారతదేశ అభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో దాదాపు 140 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో నలుగురికి మొదటి బహుమతి, ఇద్దరికి రెండో బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మహేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రొద్దం : తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి పిలుపునిచ్చారు. గురువారం గోరంట్ల మండల కేంద్రానికి చెందిన టిడిపి వీరాభిమాని ఆగిశం భరత్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం పరిగి మండలంలోని ఆర్.మరవపల్లిలో పార్థసారధి స్వగృహంలో కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధానికి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదు..

గోరంట్ల : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన ప్రధాని మోడీకి రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు లేదని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నరసింహులు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చి కేవలం మట్టి, నీరు ఇచ్చి వెళ్లడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రజలు ఎంతోమంది ఉద్యమాలతో ఉక్కు కర్మాగారాన్ని తెచ్చుకుంటే అలాంటి పరిశ్రమను ప్రయివేటీకరణకు చేయాలని పూనుకోవడం బాధాకరమన్నారు. ఈ పరిస్థితుల్లో మోడీ రాష్ట్ర పర్యటనకు రావడం బాధాకరమన్నారు. ఈ పర్యటనకు సిఎం జగన్ వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి ప్రధాని మోడీ పర్యటనలో రాష్ట్ర హక్కులు సాధించుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు.

ప్రతి కుటుంబానికీ 'ఉపాధి' కల్పించాలి

కొత్తచెరువు : మండలంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ ఉపాధి పనులు కల్పించాలని డిఎల్‌డిఒ శివారెడ్డి సూచించారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీడల్ సీరియల్ ఛానల్, సప్లై ఛానల్ పనులను గుర్తించి పనులు నిర్వహించాలన్నారు. ఇలాంటి పనులు చేయడం ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో నిర్మించుకుంటున్న ఇళ్లకు ఉపాధి హామీ బిల్లులు తక్షణమే చెల్లించాలన్నారు. అనంతరం నాగిరెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది యూనిఫాం ధరించడంతోపాటు సమయానికి విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిద్ధారెడ్డి, ఎపిఒ నాగిరెడ్డి టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సవితమ్మకు పలువురి పరామర్శ

పెనుకొండ : పట్టణంలోని వజ్రాలపేటలో ఉన్న స్వగృహంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మను సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, డివిజన్ కార్యదర్శి శ్రీరాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఓ కేసు విషయంలో సవితమ్మ సిబిఐ ఇంట్లో దాడులు నిర్వహించడం తెలిసిందే. ఈనేపథ్యంలో సవితమ్మను టిడిపి నాయకులు, కార్యకర్తలతోపాటు జనసేన, సిపిఐ నాయకులు కలిసి ధైర్యం చెబుతున్నారు. అండగా ఉంటామని భరోసా కల్పిస్తున్నారు.



సవితమ్మను పరామర్శిస్తున్న నాయకులు